ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

# బాలసుధాకర్ మౌళి కవిత్వం - సంఘ సంస్కరణ దృష్టి

యర్రంశెట్టి మణికంఠ
పరిశోధక విద్యార్థి,
తెలుగుశాఖ,
ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

ఆచార్య జర్రా అప్పారావు
తెలుగు శాఖ
ఆంధ్ర విశ్వకళాపరిషత్,
విశాఖపట్నం.

Received: 03/02/2026
Article Accepted: 24/03/2026
Published Online: 27/03/2026
DOI:10.53414/Sahithyatharangini.2026.3.1.223

**సారాంశం**

బాలసుధాకర్ మౌళి కవిత్వంలో సంఘ సంస్కరణ దృక్పథం, అభ్యుదయ భావజాలం, అట్టడుగు వర్గాల జీవన వాస్తవికత ప్రధానంగా ప్రతిఫలిస్తాయి. ఉత్తరాంధ్ర ప్రాంతంలోని పేదరికం, ఆకలి, శ్రమదోపిడి, వలసలు, సామాజిక అసమానతలు వంటి సమస్యలను కవి తన కవిత్వంలో అత్యంత హృద్యంగా చిత్రించారు. వరకట్నం, అస్పృశ్యత, ఫ్యూడల్ ఆధిపత్యం, పెట్టుబడిదారీ విధానం వంటి సామాజిక దురాచారాలపై నిరసన వ్యక్తం చేస్తూ సమసమాజ నిర్మాణాన్ని ఆకాంక్షించారు. *ఎగరాల్సిన సమయం* కవితా సంపుటిలోని **"వజ్రాయుధ ధారి"**, **"చీకటి కుక్కను తన్ని"**, **"నిరసనకారుడు"** వంటి కవితల ద్వారా చెత్తకాగితాలు ఏరుకునే కార్మికుడు, పూలమ్ముకునే వృద్ధ మహిళ, చెప్పులు కుట్టే చర్మకారుడు వంటి అట్టడుగు వర్గాల జీవితాలను మానవీయ దృష్టితో ఆవిష్కరించారు. వారి ఆకలి, ఆవేదన, ఆశలు, ఆత్మగౌరవం, శ్రమకు తగిన గౌరవం లభించని పరిస్థితులను కవి ప్రతీకాత్మకంగా, సహజమైన భాషలో వ్యక్తీకరించారు. వాస్తవికత, సామాజిక చైతన్యం, నూతన అభివ్యక్తి, మానవీయ దృక్పథం బాలసుధాకర్ మౌళి కవిత్వానికి ప్రత్యేక గుర్తింపును కల్పించాయి. ఈ వ్యాసం ఆయన కవిత్వంలోని సంఘ సంస్కరణ దృష్టిని విశ్లేషిస్తూ, సమకాలీన తెలుగు అభ్యుదయ కవిత్వంలో ఆయన స్థానాన్ని నిర్ధారిస్తుంది.

**కీలక పదాలు:** బాలసుధాకర్ మౌళి, సంఘ సంస్కరణ, అభ్యుదయ కవిత్వం, ఉత్తరాంధ్ర జీవన చిత్రణ, సామాజిక వాస్తవికత.

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

కవి సంస్కర్తగా కూడా ఉండాలి. వరకట్నం, అస్పృశ్యత, ఫ్యూడల్ ఆధిపత్యం, పెట్టుబడిదారీ విధానం, ధనికులు పేదలతో అమానవీయంగా ప్రవర్తించడం వంటి సాంఘిక దురాచారాలను ఖండించే రచనలు చేయాలి. ఇటువంటి ఇతివృత్తాలు కవుల సంస్కరణ దృష్టిని ప్రభావితం చేస్తాయి. ప్రజాకవి సమసమాజ నిర్మాణాన్ని కాంక్షిస్తాడు. బాలసుధాకర్ మౌళి కూడా ఈ కోవకు చెందినవారే. వీరు అభ్యుదయ భావాలు పుష్కలంగా కలిగిన వారు. కవిది ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతం కావున ఈయన కవిత్వంలో వారి జీవన స్థితిగతుల్ని తెలియజేసారు. పేదప్రజల జీవితాలకు అక్షర రూపం కల్పించారు మౌళి.

బడుగు, బలహీనుల జీవితాలను కవితల రూపంలో మలచిన అతికొద్దిమంది కళింగాంధ్ర కవుల్లో బాలసుధాకర్ మౌళి అగ్రగణ్యులు. సమాజంలో అట్టడుగున జీవించే జీవితాలలోకి చొరబడి వాళ్ళ మనస్తత్వాలను పరిశీలించి, పరకాయ ప్రవేశం చేసి కవిత్వీకరించారు కవి. వీపున చెత్తకాగితాల సంచిలో బతుకు దారిద్ర్యాన్ని మోస్తూ తన జీవితాన్ని వెళ్లదీస్తున్న పేదవాడిని గూర్చి కవితగా మలిచారు బాలసుధాకర్ మౌళి.

నగర వీధులన్నీ కలియతిరిగి
బైనాక్యులర్ దృష్టిలో గాలిస్తూ
దొరికే వొక్కో కాగితాన్ని
అపురూపంగా చూసుకుని మురిసిపోయాడు
ఆకలి సూదిమొనలతో గుచ్చి గుచ్చి
శరీరాన్ని సుప్తావస్థ దీనస్థితిలోకి నెడుతున్నా
ధైర్యంగా ఆహ్వానించాడు
కాలం కాగితంపై
కన్నీటి గేయాలను లిఖిస్తూ
ఏ వీధి చివర మలుపులోనో
అదృశ్యమవుతూ...

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

ఆ నిరపరాధి గుండె సంచిలో నుంచి
రాలిన స్వప్నాల మడతను విప్పి చూస్తే
నలిగిపోతున్న బతుకులు
ఎంతగా వెలిగిపోవాలని తపిస్తున్నాయో తెలుస్తుంది.
నడుస్తున్న చరిత్ర దోచుకుతినే దొరదైనప్పుడు
దేహమొక ఎముకల గూడైనా
సమరం సాగించక తప్పదేమో! ` పుట 76, ఎగరాల్సిన సమయం

చెత్త కుప్పలలో చిత్తు కాగితాలను ఏరుకుంటూ జీవించే వ్యక్తి బతుకు చిత్రాన్ని కళ్ళముందుంచారు "వజ్రాయుధ ధారి" కవితలో బాలసుధాకర్ మౌళి. ఈ కవితకు కవిపెట్టిన శీర్షిక కూడా పాఠకుడిని ఆలోచింపచేస్తుంది. చిత్తుకాగితాల సంచిని మోయడానికి ఆధారంగా పేదవాడి వంగిన వెన్నెముక ఉంది. అదే అతనికి వజ్రాయుధం.

ఈ అసమసమాజంలో అతను ఎవరికీ అపకారం చేయని నిరపరాధి. ఒక వీధిలో అదృశ్యమవుతూ, మరో వీధిలో ప్రత్యక్షమవుతాడు. తన తీక్షణమైన దృష్టితో నగరవీధులన్నీ వెతుకుతూ దొరికే ప్రతి కాగితాన్ని అపురూపంగా చూసుకుని మురిసిపోతాడు. కాలం అనే కాగితంపై కన్నీటి గేయాలను రాస్తాడు. ఆకలిని కూడా ధైర్యంగా ఆహ్వానిస్తాడు.

పేదవాడికి గొప్పగా జీవించాలనే స్వప్నాలుంటాయి. సమాజంలో అందరితో సమానంగా తన బతుకు బ్రతకాలనే ఆశ ఉంటుంది. కాని అవి వారికి స్వప్నాలుగానే మిగిలిపోతున్నాయి. ఎండకు ఎండి, వానకు తడిచి, చలికి వణికే జీవనం కొనసాగిస్తూ, అంతరంగంలో ఆశలు అడియాసలుగా మిగిలిపోయే పేద ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నిస్తాడు కవి.

నడుస్తున్న చరిత్ర అంతా దోచుకుతినే దొరలదైనప్పుడు, పేదవాడి దేహం ఎముకల గూడులా మారినా జీవన సమరం సాగించక తప్పని పరిస్థితిని చూసి బాధపడతాడు కవి.

"చీకటి కుక్కను తన్ని" అనే మరొక కవితలో బజారులో పూలమ్ముకునే ఒక వృద్ధస్త్రీ అంతరంగాన్ని కవి అద్భుతంగా ఆవిష్కరించారు.

ఆ వృద్ధస్త్రీ...
పూలను అపురూపంగా చూసుకుంటుంది
పూల గంపను అన్నం కంచంలా ముందు పెట్టుకుని
ఒక్కో పూవును
మెతుకులా భావించి
వేళ్ళతో సుతారంగా తాకి
గుండెనిండుగా పరిమళాన్ని భోంచేస్తుంది. ` పుట73, ఎగరాల్సిన సమయం.

పూలు అమ్ముడుపోతే గాని పొట్టనిండని పరిస్థితి. అందుకే కవి పూలగంపను అన్నం కంచం అని, ఒక్కో పువ్వూ ఒక్కో మెతుకని సంభావిస్తాడు. వేళ్లతో తాకుతూ గుండెనిండుగా ఆ సువాసనని భోంచేస్తుందని అంటారు కవి. రంగులు వెలిసి పోయిన పాతచీరను ఒళ్ళంతా కప్పుకుని రంగు రంగుల పూలను లోకానికి అమ్ముతుంది. నాలుగు చినుకుల కోసం ఎదురుచూసే పగిలిపోయిన నేలలా ఆమె కనుపాపలు ఎండిపోయి ఉన్నాయి.

మార్కెట్ మాయా నాటకంలో
ఉదయం నుంచి సాయంత్రం వరకూ
ఏ ఒక్కహృదయమైనా కనికరిస్తుందేమోనని
ఎదురు చూసి...
ఎదురు చూసి...
ఆకలిలా కరుస్తున్న చీకటికుక్కను
కాళ్లతో ఒక తాపు తన్ని

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

'చుక్కల గంప'ను నెత్తిన పెట్టుకుంటుంది
అప్పుడు - ఆమె కళ్లల్లో ఒక్కో పువ్వూ
రెమ్మల్ని రాల్చేస్తున్న దృశ్యం పోయి...
వెన్నెల విరగకుస్తుంది! - పుట 74 - ఎగరాల్సిన సమయం

ఉదయం నుండి సాయంత్రం వరకూ మార్కెట్లో పూలగంపను పట్టుకుని కూర్చుంది. ఒక్క హృదయం కూడా కనికరించలేదు. ఎదురు చూసి ఎదురు చూసి చీకటి పడింది. కన్నీళ్లతో నిండిన కళ్లతో ఇంటికి వెనుతిరిగింది. కళింగాంధ్ర ప్రాంతంలో ఇటువంటి ఆకలి కేకలు సర్వసాధారణం. తినడానికి సరైన తిండి లేక, బతకడానికి పని లేక, పస్తులతో అలమటిస్తున్న జీవితాలెన్నో ఉన్నాయి.

"నిరసనకారుడు" కవితలో చెప్పులు కుట్టేవాడి జీవితాన్ని అక్షరీకరించారు బాలసుధాకర్ మౌళి.

"పనిని ప్రాణంగా సంభావించే అతను
నా కంటికి కనిపించాడు
వొక్కో ఎముక వొక్కో పనిముటెట
యంత్రంకన్నా వేగంగా పని చేస్తున్నాడు
పనినే నమ్ముకున్న దీక్షాపరుడతను
........................................ ` పుట50 ` ఎగరాల్సిన సమయం

చెప్పులు కుట్టే చర్మకారుడి జీవితాన్ని గురించి తెలియజేస్తూ చిన్న గోనె పట్టా వేసుకొని ఎక్కడ బజారులో నీడ ఉంటే అక్కడే దుకాణాన్ని తెరిచి చిరిగిన వాటికి కొత్తరూపాన్నిచ్చి తమ ముందు నిలబెడతాడని అంటారు కవి. చిరిగిన చెప్పును కుట్టడానికి చేసే ప్రయత్నంలో అతనిలో ఒక సృజనకారుడు కనిపిస్తాడు. చెప్పును నునుపు చేయడానికి వాడే ఎమ్రీ పేపరు తన జీవితాన్ని నునుపు చేయలేకపోయిందని కవి

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

బాధపడుతున్నాడు. బూట్లకు మెరుపునిచ్చే పాలిష్ బ్రష్ అతని జీవితంలో కాంతులను నింపలేకపోయింది.

శ్రమకు విలువనివ్వని
చేతులిచ్చిన
చిల్లర పైసలను తీసుకుని
కళ్లకద్దుకుంటాడతను
రెక్కాడితేగాని డొక్కాడని అతని బతుకు
యిప్పటికీ ప్రశ్నార్థకమే... - పుట 51, ఎగిరాల్సిన సమయం.

శ్రమకు విలువ ఇవ్వని శ్రమదోపిడి గాళ్లు ఇచ్చే చిల్లర పైసలను తీసుకుంటాడే తప్ప, తన పనికి తగిన ప్రతిఫలం అతనికి దక్కటంలేదని కవి బాధపడతాడు. ప్రశ్నార్థకంగా మారిన పేదల జీవితాలను చూసి చలించిపోతాడు కవి. ఈ కుటిల సమాజం సిగ్గుతో తలదించుకునే రోజు రాక మానదని భవిష్యత్ దర్శనం చేస్తారు బాలసుధాకర్‌మౌళి.

బాలసుధాకర్‌మౌళి సంఘ సంస్కరణ దృష్టికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. అతని కవితల నిండా వ్యధార్థ భరిత యధార్థ జీవిత గాథలే ఉన్నాయి. కళింగాంధ్ర ప్రాంత ఆకలి నిట్టూర్పులు, కూలీ జనుల వలసలు, రైతుల ఆత్మహత్యలు, నగరాలకు వలస పోయిన జనాల బాధలను మౌళి గారు తమ కవిత్వంలో చాలా వాస్తవికంగా తెలియజేశారు. సమాజంలో అట్టడుగు ప్రజల జీవితాలను తమ రచనలలో చాలామంది తెలియజేసినప్పటికీ బాలసుధాకర్ మౌళి గారి శైలి భిన్నంగా అనిపిస్తుంది. ఇతని కవిత్వంలో ఒక ప్రత్యేకత కన్పిస్తుంది. నూతన అభివ్యక్తి, సహజమైన పదప్రయోగంతో కృతకంగా కాకుండా ఉత్తరాంధ్ర ప్రాంత దు:ఖాన్ని వాస్తవిక దృష్టితో చూపించిన కవి బాలసుధాకర్ మౌళి.

**ఉపయుక్త గ్రంథాలు**

నారాయణరెడ్డి, సి. *ఆధునికాంధ్ర కవిత్వము: సంప్రదాయములు – ప్రయోగములు.* హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1989.

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

వెల్చేరు, నారాయణరావు. *తెలుగులో కవితా విప్లవాల స్వరూపం.* హైదరాబాద్: ఎమెస్కో బుక్స్, 1987.

కాత్యాయనీ విద్మహే, పి. *ఆధునిక తెలుగు సాహిత్యం: విభిన్న ధోరణులు.* హైదరాబాద్: తెలుగు అకాడమీ, 2005.

అరుణ కుమారి, ఎం. *ఆధునిక తెలుగు కవిత్వం: సామాజిక చైతన్యం.* హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2012.